# అమ్మో రికా!

- యూఎస్‌లో భారత విద్యార్థుల వరుస మరణాలు
- ఈ ఏడాది మూడు నెలల్లో 11 మంది మృతి
- భద్రతపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆందోళన
- కిడ్నాప్‌లు, దోపిడీలకు బలవుతున్న విద్యార్థులు



అర్ఫాత్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనేది చాలా మంది భారతీయ విద్యార్థుల కల. ప్రపంచ స్థాయి విద్యతో పాటు కెరీర్ అవకాశాలు మెండుగా ఉంటాయనేది వారి ఆశ. అయితే యూఎస్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలు భారతీయ విద్యార్థులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. వరుసగా భారత విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందుతుంటడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఏడాది మూడు నెలల కాలంలోనే 11 మంది భారత విద్యార్థులు మృతిచెందారు. వీరంతా 25 ఏండ్లు లేదా అంతకంటే తక్కువ వయసు వారే కావడం గమనార్హం. గత నెల రోజులుగా కనిపించకుండా పోయిన హైదరాబాద్ విద్యార్థి మహ్మద్ అబ్దుల్ అర్ఫాత్ మృతదేహాన్ని అమెరికా అధికారులు మంగళవారం ఓహియో రాష్ట్రంలోని క్లీవ్‌లాండ్‌లో గుర్తించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి అమెరికాలో భారతీయ విద్యార్థుల మృతికి సంబంధించిన వార్తలు వస్తూనే ఉన్నాయి. డబ్బులు కోసం లేదా వ్యక్తిగత కారణాలతో జరిగే దాడులకు మన విద్యార్థులు బాధితులుగా మారుతున్నారు.

### అమెరికా తగిన చర్యలు తీసుకోవాలి

విద్యార్థుల మరణాలకు కారణాలను గుర్తించిన ఓ ప్రముఖ ప్రవాస భారతీయ సంఘం.. తగిన చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వం, యూనివర్సిటీలు, విద్యార్థి సంఘాలను కోరింది. విద్యార్థుల మృతి ఘటనలకు అనుమానాస్పద కాల్పులు/కిడ్నాపింగ్, భద్రతాపరమైన పరిజ్ఞానం లేకపోవడంతో (మోనాక్సైడ్ పాయిజనింగ్, అల్పోష్ణస్థితి) జరిగే పర్యావరణ మరణాలు, ఆత్మహత్యలను ప్రేరేపించే మానసిక సమస్యలు, అనుమానాస్పద రోడ్డు ప్రమాదాల నుంచి హింసాత్మక నేరాలు వంటివి కారణాలుగా ఉన్నాయని 'ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పొరా స్టడీస్(ఎఫ్ఐఐడీఎస్) తన అధ్యయనంలో గుర్తించింది. ఒక్కసారిగా పెరిగిన భారతీయ విద్యార్థుల మరణాలు ఆందోళనకరమని, అనుమానాస్పదమని సంబంధిత డాటా సేకరించిన బోస్టన్‌లో నివాసం ఉండే తలంకి లక్ష్మి పేర్కొన్నారు. పలువురు విద్యార్థుల మరణాల వెనుక విద్వేషపూరిత నేరాలు కూడా ఉండే అవకాశం ఉన్నదనే భయాందోళనలు ప్రవాస భారతీయ సమాజంలో వ్యక్తమవుతున్నది. ప్రధానంగా అమెరికా తూర్పు, మధ్య పశ్చిమ యూనివర్సిటీల్లో.. అది కూడా ఓహియోలోని క్లీవ్‌లాండ్, ఇల్లినాయిస్, ఇండియానా రాష్ట్రాల్లో ఈ ఘటనలు చోటుచేసుకొంటున్నాయి.

## అనుమానాస్పదంగా పలు మరణాలు

మహ్మద్ అబ్దుల్ మృతదేహం లభ్యమయ్యే కంటే ముందు గద్దె ఉమా సత్యసాయి అనే మరో భారతీయ విద్యార్థి ఇటీవల క్లీవ్‌లాండ్‌లో చనిపోయారు. సాయి మరణానికి గల కారణంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఏడాది అమెరికాలో మరణించిన భారతీయ విద్యార్థుల వివరాలు పరిశీలిస్తే.. బోస్టన్ యూనివర్సిటీలో చదువుకొంటున్న ఏపీకి చెందిన పరుచూరి అభిజిత్(20) అనే విద్యార్థి మృతదేహం క్యాంపస్ పరిధిలోని అడవిలో ఓ కారులో గుర్తించారు. డబ్బులు, ల్యాప్‌టాప్ కోసం అతనిపై దాడి చేశారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. జనవరి 3న వివేక్ సైనీ(25) జార్జియాలో హత్యకు గురయ్యాడు. ఒక స్టోర్‌లో పనిచేస్తున్న అతనిపై డ్రగ్స్‌కు బానిసైన జులియన్ ఫాల్కనర్ అనే వ్యక్తి సుత్తితో 50 సార్లు దాడి చేసి కిరాతకంగా హత్యచేశాడు. జనవరి 17న మరణించిన నీల్ ఆచార్య మృతికి వెనుక కారణం ఇంకా వెల్లడి కాలేదు. ఇంకా పలువురు విద్యార్థులు అల్పోష్ణ స్థితి, ఇతర కారణాలతో మరణించారు.



## కవలలకు టెన్త్, ఇంటర్‌లో సమాన మార్కులు

హసన్, ఏప్రిల్ 11: కర్ణాటకలోని హసన్‌కు చెందిన కవలలకు పీయూసీ (12వ తరగతి) వార్షిక పరీక్షల్లో ఒకే మార్కులు(571/600) వచ్చాయి. గతంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఇద్దరికీ ఇలాగే ఒకే మార్కులు (620/625) రావడం గమనార్హం. తాజా ఫలితాలపై కవలలిద్దరూ సంతోషం వ్యక్తం చేశారు. కవలల్లో రెండు నిమిషాలు పెద్దదైన చుక్కి స్పందిస్తూ..'ఇది పూర్తిగా యాదృచ్ఛికం. ఇలా ఇద్దరికీ ఒకే మార్కులు ఎలా వచ్చాయో మాకే తెలియడం లేదు' అని తెలిపారు. తాము 97 శాతం మార్కులు వస్తాయని ఆశించామని.. అయితే అంతకంటే కొంచెం తక్కువ వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం తాము నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నామని తెలిపారు. తామిద్దరం ఎప్పుడూ ఒకరితో ఒకరు పోటీ పడమని చుక్కి చెల్లెలు ఇబ్బని తెలిపింది.

## ఎన్సీఈఆర్టీ ఆమోదిత పుస్తకాలే వాడాలి

### రాష్ట్రాలకు ఎన్సీపీసీఆర్ లేఖ

న్యూఢిల్లీ : ఎన్సీఈఆర్టీ లేదా ఎస్సీఈఆర్టీ ఆమోదించిన టెక్ట్స్‌బుక్స్, మెటీరియల్‌ను మాత్రమే దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు ఉపయోగించాలని రాష్ట్రాలకు 'ఎన్సీపీసీఆర్' (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ చైల్డ్ రైట్స్) లేఖ రాసింది. స్కూల్ నోటీస్ బోర్డులు, వెబ్‌సైట్స్ ద్వారా ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరింది. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) పరిధిలోకి వచ్చే అన్ని పాఠశాలల్లోని సిలబస్, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన పద్ధతుల్లో ఏకరూపత ఉండేలా చూడాలని పాఠశాల విద్య కార్యదర్శులు, ప్రిన్స్‌పల్ కార్యదర్శులకు తెలిపింది. పాఠ్యప్రణాళిక మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయవలసిన అవసరాన్ని లేఖలో వివరించింది. ప్రైవేట్ సంస్థలు ప్రచురించిన పుస్తకాలను కొన్ని స్కూల్స్ అనుసరిస్తున్నాయన్న నివేదికలపై ఆందోళన వ్యక్తం చేసింది.

## లక్ష కోట్ల స్కామ్.. బిలియనీర్‌కు మరణశిక్ష



మిలాన్

హనోయ్, ఏప్రిల్ 11: మల్టీ బిలియన్ డాలర్ల మోసం కేసులో వియత్నాం రియల్ ఎస్టేట్ టైకూన్, బిలియనీర్ ట్రువాంగ్ మిలాన్‌కు ఆ దేశ కోర్టు మరణశిక్ష ఖరారు చేసింది. వియత్నాం ప్రఖ్యాత డెవలపర్ వాన్ తిన్ ఫట్ కంపెనీకి ఆమె చీఫ్. అయితే, గత దశాబ్ద కాలంలో సైగాన్ కమర్షియల్ బ్యాంక్ నుంచి ఆమె పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు రూ.లక్ష కోట్లు (ఆ దేశ జీడీపీ-2022లో 3 శాతం) ఆమె బ్యాంకు నుంచి తీసుకుంటున్నట్టు తేలింది. అయితే, ఈ కుంభకోణం విలువ రూ.2.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఎరగా వేస్తూ ఈ డబ్బును ఆమె అక్రమంగా వేల షెల్ కంపెనీలకు మళ్లించినట్టు తేలింది.

## ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధమేఘాలు

జెరూసలెం: పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం విస్తరించే ప్రమాదం కనిపిస్తున్నది. ప్రస్తుత పరిస్థితిల్లో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తప్పదేమోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. గాజాలో తమ భద్రతా దళాలు ఆపరేషన్ కొనసాగిస్తున్న వేళ ఇలాంటి దృశ్యాలు మరోచోట కూడా చూడటానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ ప్రకటించడంతో ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం తప్పదంటూ సంకేతాలు వెలువడ్డాయి. ఏప్రిల్ 1న సిరియాలోని కాన్సులేట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వాయు సేన దాడిలో ఇరాన్‌కు చెందిన టాప్ మిలటరీ జనరల్‌తో పాటు ఆరుగురు అధికారులు మరణించారు. దీంతో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ యుద్ధ భయంతో టెహ్రాన్‌కు ఈ నెల 13 వరకు విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్టు జర్మనీ ఎయిర్‌లైన్స్ లుఫ్తాన్సా ప్రకటించింది. ఇజ్రాయెల్, లెబనాన్, పాలస్తీనియన్ వంటి పశ్చిమాసియా ప్రాంతాలకు ప్రయాణించవద్దంటూ రష్యా విదేశాంగ శాఖ తన పౌరులకు సూచించింది.

## రైల్వేలో 15% డ్రైవర్ పోస్టుల ఖాళీ

న్యూఢిల్లీ: రైల్వే శాఖలో 15 శాతం డ్రైవర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని రైల్వే బోర్డు తెలిపింది. జీవన్ ప్రకాశ్ శర్మ ఆర్టీఐ ద్వారా ఈ సమచారాన్ని రాబట్టారు. మొత్తం 1,27,644 మంజూరైన డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్ల పోస్టులలో 2024, మార్చి 1 నాటికి 18,766 పోస్టులు(14.7 శాతం) ఖాళీగా ఉన్నట్టు రైల్వే బోర్డు తెలిపింది. మంజూరైన లోకో పైలట్ల (డ్రైవర్లు) పోస్టులు 70,093 కాగా,. అందులో 14, 429 (సుమారు 20.5శాతం) ఖాళీగా ఉండగా.. అసిస్టెంట్ లోకో పైలట్‌ల కోసం మొత్తం మంజూరైన 57,551 పోస్టుల్లో 4,337(సుమారు 7.5శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## సైబర్ నేరాల్లో భారత్‌కు 10వ ర్యాంక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సైబర్ నేరాలు, మోసాలు జరుగుతున్న దేశాల్లో భారత్ 10వ స్థానంలో నిలిచింది. మొత్తం 100 దేశాలకు ర్యాంకులు విడుదల చేయగా, రష్యా మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఉక్రెయిన్, చైనా, అమెరికా, నైజీరియా, రొమేనియా, ఉత్తర కొరియా ఉన్నాయి. బ్రిటన్, బ్రెజిల్ దేశాలకు 8, 9 ర్యాంకులు వచ్చాయి. అంతర్జాతీయ పరిశోధకులు బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా 'వరల్డ్ సైబర్ క్రైమ్ ఇండెక్స్'ను రూపొందించారు. ర్యాన్సమ్‌వేర్, క్రెడిట్ కార్డు దొంగతనాలు, మోసాలు సహా వివిధ రకాల సైబర్ నేరాలకు ప్రపంచంలో హాట్‌స్పాట్స్‌ను నివేదిక గుర్తించింది. మాల్‌వేర్, ర్యాన్సమ్‌వేర్ దాడులు, డాటా చోరీ, హ్యాకింగ్, వర్చువల్ కరెన్సీ పేరుతో మనీ లాండరింగ్ ప్రధానమైన సైబర్‌నేరాలుగా పరిశోధకులు వర్గీకరించారు.

## దళిత రైతుల సొమ్ముతో ఎన్నికల బాండ్లు

- అధిక వడ్డీ వస్తుందని మాయమాటలు
- గుజరాత్‌లో వెలుగు చూసిన దారుణం
- బీజేపీ వాటా 10 కోట్లు.. శివసేన వాటా కోటి
- పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 11( నమస్తే తెలంగాణ ): వారంతా దళితులు.. పైగా నిరక్షరాస్యులు.. వారిని మోసం చేయటానికి ఇంతకన్నా ఇంకేం కావాలి? అనుకున్నారేమో.. అడ్డంగా దోపిడీకి తెరలేపారు. గుజరాత్ రాష్ట్రంలో ఈ ఘటన జరిగింది. ప్రాజెక్టు కోసమని ఓ కంపెనీ ఆరు మంది దళితులకు చెందిన భూమిని కొనుగోలు చేసింది. అయితే చెల్లించాల్సిన సొమ్ములో కొంత మొత్తం ఇచ్చి.. మిగతా సొమ్ముతో ఎలక్టోరల్ బాండ్లు కొన్నది. ఇవేమీ తెలియని ఆ దళిత రైతులను మాత్రం మీ సొమ్ముకు అధిక వడ్డీ వస్తుందని నమ్మించారు. మోసపోయిన విషయం ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ దగా పర్వంలో సింహభాగం బీజేపీది కాగా.. మిగిలిన కొసరు భాగం శివసేన పార్టీది. ఈ సంఘటనకు సంబంధించి దళితుల తరపున వకాల్తా పుచ్చుకున్న న్యాయవాది గోవింద్ దఫాదా ప్రకారం పూర్తి వివరాలిలా ఉన్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని అంజర్ గ్రామంలో ప్రాజెక్టు పెడుతున్నామని వెల్సన్ గ్రూప్‌నకు చెందిన వెల్సన్ అంజర్ సెట్ లిమిటెడ్ కంపెనీ ఆ గ్రామానికి చెందిన ఓ దళిత రైతు మన్వర్ కుటుంబాన్ని కలిసింది. వారి భూమిని తమకు విక్రయించాలని కోరింది. మన్వర్ కుటుంబంలోని ఆరుగురి పొత్తులో ఉన్న 43వేల చదరపు మీటర్ల వ్యవసాయ భూమిని కొనటానికి కంపెనీ సిద్ధమైంది. కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఆ భూమికి ధర నిర్ణయించింది. గజానికి 17,500గా తేల్చింది. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం దళిత రైతులకు మొత్తం భూమికి గాను రూ. 76 కోట్లు చెల్లించాలి. అంత ధరకు తాము కొనలేమని కంపెనీ కొనుగోలును వాయిదా వేసుకున్నది. అయితే ఏడాదిలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే మళ్లీ మొదటి నుంచి ఆ ప్రక్రియ మొదలు పెట్టాల్సి వస్తుందని డిప్యూటీ కలెక్టర్ మెహల్ దేశాయి రంగంలోకి దిగాడు. మొత్తం భూమిని 16.61 కోట్లకు విక్రయించేలా దళిత రైతులను ఒప్పించాడు. ముందుగా రైతులకు రూ.2.80 కోట్లను చెల్లించారు. మిగిలిన సొమ్ముతో వెల్సన్ సెజ్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ మహేంద్రసింగ్, ల్యాండ్ అక్విజేషన్ అధికారి విమల్ కిశోర్ జోషి, అంజర్ నగర బీజేపీ అధ్యక్షుడు డేనీ రజనీకాంత్ షా కలిసి ఎస్‌బీఐలో ఎలక్టోరల్ బాండ్లు కొన్నారు. అదేమని అడిగిన రైతులను అధిక వడ్డీ వస్తుందని మాయమాటలు చెప్పి నమ్మించారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న బాధితులు తమకు ఎలక్టోరల్ బాండ్ల వల్ల కలిగే ప్రయోజనమేమిటని నిలదీశారు. రైతులకు చెల్లించాల్సిన 11.14 కోట్లలో రూ. 10 కోట్ల బాండ్లను బీజేపీ క్యాష్ చేసుకోగా.. మిగిలిన రూ.కోటీ 14వేల బాండ్లను శివసేన పార్టీ క్యాష్ చేసుకున్నది. దళిత రైతు మన్వర్ కొడుకు హరేశ్ సవకర్ ఈ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు సంగతి బయటకు వచ్చింది.

## ఐఫోన్‌లోకి స్పైవేర్.. జాగ్రత్త!

### యూజర్లకు యాపిల్ అలర్ట్




(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ఐఫోన్ యూజర్లకు యాపిల్ హెచ్చరికలు జారీ చేసింది. మెర్సినరీ స్పైవేర్ల (కిరాయికి తీసుకొన్న స్పైవేర్) ద్వారా లక్షిత యూజర్ల ఫోన్లు సైబర్ దాడులకు గురికావొచ్చని అలర్ట్ చేసింది. ఈ మేరకు భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 91 దేశాల్లోని పలువురు యూజర్లకు థ్రెట్ నోటిఫికేషన్లను పంపించింది.

**ఏమిటీ మెర్సినరీ స్పైవేర్?**

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్ తయారు చేసిన పెగాసస్ లాంటి స్పైవేర్లను మెర్సినరీ స్పైవేర్లుగా పిలుస్తారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన వీటితో ప్రముఖులైన లక్షిత వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుంటారు. సైబర్ దాడులకు గురికాకుండా యాపిల్ ఫోన్లకు ప్రత్యేక రక్షణ ఉంటుంది. అయితే, యాపిల్ ఐడీ సాయంతో మెర్సినరీ స్పైవేర్లు ఐఫోన్లు, ఇతర యాపిల్ ఉత్పత్తులలోకి సులభంగా చొరబడగలవని నిపుణులు చెప్తున్నారు. ఇదే జరిగితే, ఆ ఉత్పత్తుల ద్వారా ఎవరేం చేస్తున్నారన్న ప్రతీ విషయం నేరగాళ్లకు చేరుతుంది.

